
సాక్షి
బాపట్ల
మంగళవారం । 25 । జూన్ । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 504.30 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



స్టూడెంట్ కిట్స్ పంపిణీ

తెనాలిఅర్బన్: ఐతానగర్ ఆది ఆంధ్ర ఎలిమెంటరీ స్కూల్‌లోని విద్యార్థులకు సోమవారం స్టూడెంట్ కిట్స్‌ను 39వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గెద్దేటి ఝాన్సీవాణి పంపిణీ చేశారు.



బాబా సన్నిధిలో ఆర్ఎస్ఎస్ ప్రచారక్

మంగళగిరి: పెదవడ్లపూడి సాయిబాబాను సోమవారం ఆర్ఎస్ఎస్ ఏపీ ప్రచారక్ విజయ్ ఆదిత్య దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త పాతూరి నాగభూషణం స్వాగతం పలికారు.

తీరంలో మరణ మృదంగం

- బోసిపోతున్న వాడరేవు, రామాపురం బీచ్‌లు
- నెల రోజుల్లో 18 మంది మృత్యువాత
- పర్యాటకులను అనుమతించని పోలీసులు
- రిసార్ట్స్ యజమానుల నిర్లక్ష్యం
- భద్రత చర్యలు శూన్యం



తీరంలో నిషేధం గురించి యువకులకు వివరిస్తున్న పోలీసులు

చీరాల టౌన్: జిల్లాలో మినీ గోవాగా పేరొందిన వాడరేవు, రామాపురం బీచ్‌ల్లో మరణ మృదంగం మోగుతోంది. విహార యాత్రలు విషాదంగా మారుతున్నాయి. నెల రోజుల్లో 18 మంది మృత్యువాత పడటం పరిస్థితికి అద్దం పడుతోంది. చీరాల వాడరేవు, రామాపురం తీరప్రాంతాలకు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు సెలవు రోజుల్లో అధికంగా వస్తుంటారు. వారానికి ఒకరు లేదా ఇద్దరు సముద్రం అలలకు బలవ్వడం సాధారణంగా మారింది. ఏలూరు జిల్లాకు చెందిన స్నేహితులు నలుగురు.. మంగళగిరికి చెందిన స్నేహితులు ఇద్దరు.. కావూరివారిపాలేనికి చెందిన ఒకరు.. తాడేపల్లిగూడేనికి చెందిన యువకుడు.. చెన్నైకి చెందిన వ్యక్తి ఒకరు.. ఇలా చెప్పుకుంటూ పోతే రామాపురం తీర ప్రాంతం పర్యాటకుల్ని కబళిస్తోంది. ఒక్క వారంలోనే ఏడుగురు మృత్యువాత పడగా, నెల రోజుల్లో 18 మంది రాకాసి అలలకు బలైపోయారు. గతంలో సివిల్, మెరైన్ పోలీసులు నామమాత్రపు గస్తీని మాత్రమే ఏర్పాటు చేసేవారు. శని, ఆది వారాల్లో మినహా మిగిలిన రోజుల్లో తీర ప్రాంతాల్లో మచ్చుకైనా కన్పించేవారు కాదు. దీంతో పర్యాటకులు ఇష్టానుసారంగా ప్రవర్తించేవారు. సముద్రం లోతుకు వెళ్లి అలల్లో కొట్టుకుపోయేవారు. జూన్ నెలలోనే 18 మంది పర్యాటకులు కడలి ఆగ్రహానికి బలవ్వడంతో ఇప్పుడు పోలీసులు మేల్కొన్నారు. ప్రస్తుతం సముద్ర తీర ప్రాంతంలో 10 బీట్లు, మూడు పికెట్లు ఏర్పాటు చేసి 24 గంటలు గస్తీ కాస్తున్నారు. తీరానికి ఎవ్వరూ రాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

సుడిగుండాలు అధికం

రామాపురం తీర ప్రాంతం స్నానాలకు అనుకూలంగా లేదు. లోతు ఎక్కువగా ఉండటంతో పాటు సుడిగుండాలు అధికంగా ఉన్నాయి. దీంతో సముద్ర తీరంపై అంచనా లేకండా కొందరు పర్యాటకులు ఉత్సాహంగా లోనికి వెళ్లడంతో సుడిగుండాల్లో చిక్కి మృత్యువాత పడుతున్నారు. ఇందులో యువతే అధికంగా ఉండటం శోచనీయం. స్థానిక మెరైన్, సివిల్ పోలీసుల వైఫల్యం తీవ్రంగా కనిపిస్తోంది. ప్రమాదకర స్థలాల్లో డేంజర్ బోర్డులు, పర్యాటకుల్ని హెచ్చరిస్తూ మైక్ అనౌన్స్‌మెంట్లు లేవు. గజ ఈతగాళ్లు లేకపోవడంతో అలల సవ్వడికి ఆకర్షితులై యువకులు క్షణాల్లో గల్లంతై ప్రాణాలు కోల్పోతున్నారు. రిసార్టు యజమానులు కనీసం పర్యాటకులకు లైఫ్ జాకెట్లు కూడా అందించకపోవడంతో తీరం మృత్యువుకు నిలయంగా మారింది. భారీగా వస్తున్న రాకాసి అలలకు పర్యాటకులు మృత్యువాత పడుతున్నారు.



తీరం నుంచి పర్యాటకులను పంపించి వేస్తున్న పోలీసు అధికారులు

రిసార్టు యజమానుల నిర్లక్ష్యం

పర్యాటకుల్ని ఆకర్షించేందుకు విలాసవంతమైన భవనాలు, స్విమ్మింగ్ పూల్స్, అదిరిపోయే ఈవెంట్లు ఏర్పాటు చేసి లక్షల రూపాయలు వసూలు చేసే రిసార్టు యజమానులు మాత్రం భద్రతను గాలికొదిలేస్తున్నారు. ఎక్కడా లేని విధంగా 12 గంటలకు ఒక్కో రిసార్టుకు రూ.6 వేల నుంచి రూ.14 వేలు వరకు వసూలు చేస్తున్నారు. అవసరమైతే అదనపు చార్జీలతో క్యాంప్ ఫైర్లు, సీ నైట్ డిన్నర్, రెయిన్ డ్యాన్స్, గానా బజానాలు ఏర్పాటు చేస్తున్నారు. పర్యాటకుల నుంచి 24 గంటలు డబ్బులు దోచుకుంటున్నారే గానీ కనీసం భద్రత చర్యలు చేపట్టడం లేదు. గజ ఈతగాళ్లు, లైఫ్ జాకెట్లు, హెచ్చరిక బోర్డులు, సముద్రం లోతు ప్రాంతం అనే బోర్డులు మచ్చుకైనా ఏర్పాటు చేయడం లేదు.

రామాపురం తీరంపై పలు అనుమానాలు

రామాపురం తీరంలోనే అధికంగా పర్యాటకులు మృత్యువాత పడటంతో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. పర్యాటకులు స్నానాలు చేసేందుకు అనుకూలం కాదేమోననే సందేహం రేకెత్తుతోంది. సేఫ్ అయిన వాడరేవు తీరానికి కాకుండా సుడి గుండాలు, లోతు, ప్రమాద భరితంగా ఉండే రామాపురానికే పర్యాటకులు అధికంగా వెళ్లడం, కనీస రక్షణ చర్యలు లేకపోవడంతోనే అధికంగా మృత్యువాత పడుతున్నారనే ప్రచారం జోరుగా జరుగుతోంది. వాడరేవు, రామాపురం తీరప్రాంత గ్రామాల్లో పర్యాటకుల్ని అప్రమత్తం చేయడంతో పాటు అత్యవసరమైన ఏటీవీ వాహనం, గజ ఈతగాళ్లకు లైఫ్ జాకెట్లు, ఇతర పరికరాలను వాడరేవుకు చెందిన రామానంద సరస్వతి స్వామీజీ ట్రస్ట్ అందించింది. ఇప్పుడు ఆ పరికరాలు ఏమయ్యాయే కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది.

పర్యాటకులకు నో ఎంట్రీ

రామాపురంలో గత నెల రోజుల్లో 18 మంది యువకులు మృత్యువాత పడటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. చీరాల మండలంలోని సముద్ర తీర ప్రాంతమైన విజయలక్ష్మీపురం, వాడరేవు నుంచి వేటపాలెం, రామాపురం, పొట్టి సుబ్బయ్యపాలెం, కఠారిపాలెం గ్రామం వరకు సోమవారం నుంచి పర్యాటకులకు అనుమతిని నిలిపివేశారు. తీరానికి వచ్చే దారుల్లో ఆంక్షలు విధించారు. ఎవ్వరినీ సముద్ర తీరానికి అనుమతించడం లేదు. రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శివకుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది తీరంలో పహారా కాస్తున్నారు. తీరప్రాంతంలోకి ఎవ్వరికి ప్రవేశం లేదని చాటింపు చేయించి, తీరంలో ఉన్న పర్యాటకులను ఇళ్లకు పంపించి వేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారిని కూడా వెనక్కి పంపారు.



రామాపురంలోకి పర్యాటకులు రాకుండా గస్తీ కాస్తున్న రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు

బీచ్‌లకు రావొద్దు

- ఎస్పీ వకుల్‌జిందాల్
- తాత్కాలికంగానిలిపివేత

బాపట్ల: సముద్రంలో సుడులు ఏర్పడటం వల్ల తీరంలో పర్యాటకులకు అనుమతి లేదని ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల వరుస ప్రమాదాలు చోటు చేసుకోవడం వల్ల పర్యాటకుల శ్రేయస్సు దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని సూర్యలంక, వాడరేవు, రామపురం బీచ్‌లకు ఎవరూ రావొద్దని ఆయన సూచించారు. సుడిగుండాలు తొలిగిన వెంటనే మళ్లీ అనుమతిస్తామని ఆయన తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటా !

నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి



కార్యకర్తలు, నాయకులతో మాట్లాడుతున్న చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సోమవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని చెప్పారు. తాను అద్దంకిలోనే ఉంటూ కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. తెలుగుదేశం పార్టీ కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై దాడులు చేయడం, ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం చేయడమే విధిగా పెట్టుకుందని ధ్వజమెత్తారు. ప్రతి ఒక్కరికీ మంచి చేసిన వైఎస్సార్ సీపీని ప్రజలు మళ్లీ తప్పక ఆదరిస్తారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

జీఓ 117ను రద్దు చేయాలని మంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రాథమిక విద్యకు ఆటంకంగా ఉన్న జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేసినట్లు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్. వెంకటరావు, బి. హైమారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా ప్రవేశపెట్టాలని కోరుతూ వినతిపత్రం సమర్పించినట్లు వివరించారు.

జాతీయ రగ్బీ పోటీలకు నూతక్కి విద్యార్థి



మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి షేక్ మహ్మద్ సల్మాన్ జాతీయ రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ కె.రజనీ నాయక్ సోమవారం తెలిపారు. ఇటీవల బాపట్లలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని గుంటూరు జిల్లా జట్టుకు కాంస్య పతకం సాధించినట్లు వెల్లడించారు. ఈనెల 26 నుంచి 28 వరకు పూణే బాలివాడి స్టేడియంలో జరిగే జాతీయ రగ్బీ పోటీలలో పాల్గొననుండా పాఠశాల హెచ్ఎం రాజీవ్‌రత్న, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించినట్లు తెలిపారు.

యార్డుకు 45,769 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 45,769 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 40,696 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 20,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,000 నుంచి రూ. 18,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,500 నుంచి రూ. 19,700 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 17,563 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

28న మెగా జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా ఉపాధి కార్యాలయం, సమర్థనం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 28న అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రఘు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 30 ప్రముఖ సంస్థలు పాల్గొంటున్న జాబ్ మేళాలో 18 నుంచి 35 ఏళ్లలోపు టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు రెజ్యూమ్, ఆధార్ జిరాక్స్, విద్యార్హతల ధ్రువపత్రాలతో ఈనెల 28న ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 63648 67800, 63648 67801, 63648 67802 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉచిత న్యాయ సహాయంపై ఖైదీలకు అవగాహన

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు బ్రాడీపేటలోని జిల్లా కారాగారాన్ని సోమవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి తనిఖీ చేశారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు, కారాగారంలో నెలకొన్న లీగల్ సర్వీసెస్ క్లినిక్‌ను పరిశీలించారు. ఉచిత న్యాయ సహాయంపై ఖైదీలకు వివరించారు. ప్రతి నిందితుడూ న్యాయ సహాయం పొందకుండా ఉండరాదని, ప్రతి ఖైదీకీ ఉచిత న్యాయ సహాయం త్వరగా అందించేందుకు సూచనలు వెల్లడించారు. అనంతరం వంటశాలను తనిఖీ చేసి, ఖైదీలు భుజించే ఆహారాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వంటశాలలో పాటించాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. భోజన, మౌలిక వసతులపై ఖైదీలతో మాట్లాడగా, వారు సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే మహిళా ఖైదీలకు అందిస్తున్న సదుపాయాలను పరిశీలించారు.

రెచ్చిపోతున్న సైబరాసురులు

- పెచ్చుమీరుతున్న ఆన్‌లైన్ మోసాలు
- మాయ మాటలు, యాప్‌లతో దోపిడీ
- అధిక మొత్తంలో డబ్బులు కోల్పోతున్న అమాయకులు



రేపల్లె రూరల్: తీర ప్రాంతమైన రేపల్లెలోనూ సైబర్ నేరాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి. మాయమాటలతో వింత దారుల్లో అమాయకపు ప్రజల్ని కేటుగాళ్లు దోపిడీ చేస్తున్నారు. యాప్‌ల ద్వారా అక్రమంగా డబ్బుల్ని కొల్లగొట్టి ఖాతాల్లోకి లాక్కుంటున్నారు.

చిరువ్యాపారి నుంచి రూ.60వేలు మాయం

రేపల్లె పట్టణానికి చెందిన నిరంజన్ చిరు వ్యాపారి. ఆన్‌లైన్ సర్వీసు ద్వారా డబ్బుల లావాదేవీల్ని తమ కంపెనీ యాప్ ద్వారా ఎక్కువ జరుపుతున్నారంటూ ఇటీవల ఓ అపరిచిత వ్యక్తి ఆయనతో ఫోన్ ద్వారా మాటలు ప్రారంభించాడు. యాప్‌లో అధిక లావాదేవీలు నిర్వహించే వినియోగదారులు కొంతమందిని లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేసి ప్రోత్సాహక నగదు బహుమతులు పంపుతున్నామంటూ ఆశ పెట్టాడు. బ్యాంక్ అకౌంట్‌లో రూ.200 జమ చేశామని చెప్పాడు. ఇప్పుడు డబ్బులు పంపిన యాప్ ద్వారా రూ.100 పంపితే మరలా రూ.600 పంపుతామని చెప్పాడు. నిరంజన్ ఆ మాటలు నమ్మి యాప్ ద్వారా రూ.100 పంపాడు. అప్పటి నుంచి రూ.600 రాకపోగా బ్యాంక్ ఖాతా నుంచి వరుసగా రూ.10,000, రూ.25,000, రూ.35,000 చొప్పున వరుసగా రూ.60వేలకుపైగా నగదు మాయమైపోవడంతో లబోదిబోమంటూ వాపోయాడు. యాప్‌ల వినియోగంపై అవగాహన కలిగిన వ్యక్తి దగ్గరకు వెళ్లాడు. అతను యూపీఐ అడ్రస్‌లు, పాస్‌వర్డ్‌లు మార్చడంతో బ్యాంక్ ఖాతా నుంచి నగదు కట్ అవ్వడం ఆగిపోయింది.

ఆన్‌లైన్ జాబ్‌తో టోకరా

ఈశ్వర్ అనే యువకుడు రేపల్లె పట్టణంలోని ఓ దుకాణంలో పని చేసుకుంటూ కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నాడు. ఒక లోకల్ యాప్‌లో ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో సర్వీసు చేస్తూ డబ్బులు సంపాదించవచ్చని ఉండటంతో ఇచ్చిన ఫోన్ నంబరును సంప్రదించాడు. ముందుగా రూ.1500 చెల్లిస్తే జాబ్ వివరాల్ని తెలియజేయడంతో పాటు తమ ప్రతినిధులు జూమ్ యాప్‌లో శిక్షణనిస్తారని తెలిపాడు. రూ.1500 చెల్లించిన తరువాత జూమ్ యాప్‌లో పలు అంశాలపై మాట్లాడారు. ఓ ప్రముఖ షాపింగ్ యాప్‌కు సంబంధించి కస్టమర్ సర్వీసు ప్రొవైడర్‌గా అవకాశం ఉందని నమ్మబలికించారు. రూ.3500తో పాటు ఆధార్ కార్డును తమకు వాట్సాప్ చేయాలని చెప్పడంతో ఈశ్వర్ వివరాలతో పాటు నగదును పంపాడు. మరలా ఒక గంట తరువాత వారు ఫోన్ చేసి మరో రూ.5వేలు చెల్లించాలని, ఈ జాబ్ మీకు రావడంతో పాటు అడ్వాన్సుగా నగదు అకౌంట్‌లో జమ చేస్తామని నమ్మించారు. దీంతో స్నేహితుల వద్ద అప్పు చేసి మరి వారు అడిగిన నగదును ఈశ్వర్ చెల్లించాడు. మరో గంట తరువాత చివరిగా మరో రూ.4వేలు చెల్లించాలని ఫోన్ చేయడంతో మోసపోయానని గ్రహించాడు. డబ్బులు వెనక్కి ఇవ్వమని కోరినా యాప్ నిర్వాహకులు పట్టించుకోలేదు. తరువాత పలుమార్లు ఫోన్ చేసినా ఆ నంబరు నుంచి స్పందన లేదని ఈశ్వర్ వాపోయాడు.

అప్రమత్తంగా ఉండాలి



ఫోన్లలో యాప్‌లను ఉపయోగించే సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. సైబర్ నేరాల బారిన పడిన వారు నిర్భయంగా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వాట్సాప్, ఫేస్‌బుక్, ఫోన్లను మాట్లాడకుండా తిరస్కరించడమే మంచిది. ప్రామాణికత లేని ఏ ఇన్‌స్టంట్ లోన్ యాప్‌లను ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోరాదు. ఆన్‌లైన్‌లో అపరిచిత వ్యక్తులకు సంబంధించిన ఫోటో గ్యాలరీలు, నంబర్లుకు వ్యక్తి గత సమాచారం, ఫోటోలు షేర్ చేయకుండా ఉండటమే ఉత్తమం. సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన తీసుకువచ్చేందుకు కృషి చేస్తాం.

– నజీర్‌బేగ్, పట్టణ సీఐ, రేపల్లె

రూ.10లక్షల బంపర్ డ్రాతో మోసం

మధ్య తరగతి కుటుంబానికి చెందిన ప్రణీత్‌కు సెంటరులో పనులు ముగించుకుని ఇంటికి వెళ్లేసరికి తల్లిదండ్రులు పోస్టాఫీసు నుంచి వచ్చిందని ఒక కవర్‌ను ఇచ్చారు. అది స్పీడ్ పోస్టు ద్వారా వచ్చింది. తెరచి చూడగా ఒక ప్రముఖ ఆన్‌లైన్ షాపింగ్ కంపెనీ ద్వారా తీసిన లక్కీ డిప్ కార్డుతో పాటు కొన్ని నిబంధనలతో కాగితం ఉన్నాయి. కార్డును స్క్రాచ్ చేయగా మూడో బహుమతిగా రూ.10లక్షల ప్రైజ్ మనీ గెలుపొందినట్లు వచ్చింది. దీంతో ప్రణీత్‌కు ఆశ కలిగింది. నిబంధనల కాగితాన్ని పరిశీలించగా లక్కీ డిప్‌లో వచ్చిన నగదు బహుమతిలో సుమారు 5శాతం ముందుగానే తాము తెలిపిన నంబరుకు పంపాలని ఉంది. దీంతో ప్రణీత్‌కు అనుమానం కలిగింది. ఈ విషయాన్ని స్నేహితుల దృష్టికి తీసుకెళ్లగా మోసమంటూ తెలిపారు.

ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం

అధికారులకు జిల్లా సంయుక్త కలెక్టర్ శ్రీధర్ ఆదేశం



అర్జీలను పరిశీలిస్తున్న జిల్లా సంయుక్త కలెక్టర్ శ్రీధర్

బాపట్ల: ప్రజల సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్. శ్రీధర్ అధికారుల్ని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ వినతి పత్రాల ద్వారా విజ్ఞప్తి చేశారు. తన పరిధిలోని వాటికి అక్కడికక్కడే ఆయన పరిష్కార మార్గం చూపారు. తన పరిధిలో లేని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, బాపట్ల ఆర్డీవో జి. రవీందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో...

జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం ఎస్పీ వకుల్‌జిందాల్ ఆధ్వర్యంలో జరిగింది. జిల్లాలోని 45మంది వివిధ సమస్యలపై ఫిర్యాదులు చేశారు. చట్టపరమైన సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఆదేశించారు.

నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలి

నీట్ విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షుడు మేధ శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ఆయన జేసీకి వినతిపత్రం అందించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వివిధ సంఘాల నాయకులు ఆట్ల బాలాజీరెడ్డి, గొర్రుముచ్చు ఆనందరావు ఉన్నారు.

మళ్లీ ఉద్యోగాల్లోకి తీసుకోవాలి

తమను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ రాజీనామా చేసిన పలువురు వలంటీర్లు జేసీకి వినతి పత్రం అందించారు.

వైద్యాధికారి లైంగిక వేధింపులపై విచారణ

- అధికారుల వద్ద గోడు వెళ్లబోసుకున్న సిబ్బంది
- ఆధారాల సమర్పణ

కొల్లూరు: మద్యం మత్తులో వైద్యాధికారి లైంగికంగా వేధింపులకు పాల్పడినట్లు బాధిత ఉద్యోగినుల ఫిర్యాదుపై ఎట్టకేలకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు విచారణకు పూనుకున్నారు. వైద్యాధికారి ఆగడాలపై బాధిత సిబ్బందిని కొల్లూరు పీహెచ్‌సీలో సోమవారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. 38 మంది నుంచి లిఖితపూర్వక వాంగ్మూలాలు తీసుకున్నారు. విచారణలో పలువురు కన్నీటి పర్యంతమయ్యారు. సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. కొల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారిగా దావులూరి రవిబాబు పని చేస్తున్నారు. వైద్యశాలలోని ఓ గదిని మద్యపానశాలగా మార్చివేశాడు. నిత్యం మద్యం మత్తులో మహిళా ఏఎన్ఎంలు, ఇతర సిబ్బందిని లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడు. మహిళా సిబ్బంది ఉద్యోగాలు చేయడానికే భయపడేలా ప్రవర్తిస్తున్నాడు. పైగా సెల్ ఫోన్‌లకు అసభ్యకరమైన మెసేజ్‌లు పంపిస్తున్నాడు. దీంతో ఓపిక నశించిన ఉద్యోగినులు మూకుమ్మడిగా రెండు నెలల కిందట జిల్లా వైద్య శాఖాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.



వైద్యాధికారి వేధింపులను విచారణాధికారి దృష్టికి తీసుకెళ్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ

పట్టించుకోని అధికారులు

ఉన్నతాధికారులు రవిబాబును రేపల్లె వైద్యశాలకు డెప్యుటేషన్‌పై పంపించి చేతులు దులుపుకున్నారు. కనీసం విచారణ చేపట్టి చర్యలు చేపట్టకపోవడం వివాదాస్పదంగా మారింది. డీఎం అండ్ హెచ్ఓ కూడా వత్తాసు పలకడంతో పాటు ప్రభుత్వం మారడంతో రవిబాబు ఆగడాలు పెచ్చరిల్లాయి. సామాజిక మాధ్యమాలలో కూడా పోస్టులు పెట్టడంతో సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. తమకు న్యాయం జరగడానికి మహిళా సిబ్బంది పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేపట్టడానికి సైతం సిద్ధమవ్వడంతో పాటు, టీడీపీ నాయకుల్ని ఆశ్రయించారు. పరిస్థితి చేయి దాటిందన్న విషయాన్ని గ్రహించిన వైద్యశాఖాధికారులు విచారణ చేపట్టారు. వైద్యాధికారి రవిబాబు కూడా లిఖితపూర్వకంగా వివరణ అందజేసి వెనుతిరిగారు. ఆ సమయంలోనూ అతను మద్యం మత్తులోనే ఉండటంపై విచారణాధికారులు కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ మాట్లాడుతూ వైద్యాధికారిపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో న్యాయం కోసం ఉన్నతస్థాయికి వెళతామని హెచ్చరించారు. ఉద్యోగినుల ఫిర్యాదులపై సకాలంలో స్పందించక పోవడంతో పాటు వైద్యాధికారికి వత్తాసు పలికిన డీఎం అండ్ హెచ్ఓపై చర్యలు తీసుకోవాలని ఆయన లిఖితపూర్వకంగా విచారణాధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణాధికారిణి డీపీఎంఓ బి.బి.ఎస్. రోహిణి రత్నశ్రీ నేతృత్వంలో సిబ్బంది నుంచి డీఎం అండ్ హెచ్ఓ కార్యాలయ సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్లు టి. మురళీకృష్ణ, కె.వి.రమేష్ వివరాలు సేకరించారు.

క్లుప్తంగా

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకుకు అవార్డు



కొరిటిపాడు: పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ఈనెల 21న న్యూఢిల్లీలో నిర్వహించిన వార్షిక ఫెలిసిటేషన్ కార్యక్రమంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌కు ప్రతిష్టాత్మక ఏపీవై అవార్డుతో సత్కరించినట్లు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వి.వీరారెడ్డి సోమవారం తెలిపారు. అవార్డును యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈఓ ఎ.మణిమేఖలై అందజేసి ప్రశంసించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీజీజీబీ బ్యాంక్ చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి, జనరల్ మేనేజర్ డాక్టర్ బి.వి.రమణారావు పాల్గొన్నట్లు తెలిపారు. చైర్మన్ కె.ప్రమోద్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రతిష్టాత్మక అవార్డును సీజీజీబీ ఉద్యోగులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. ఉద్యోగుల కృషి బ్యాంకు అభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డాయని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



కర్లపాలెం: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి మృతి చెందిన సంఘటన కర్లపాలెంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. మండలంలోని పెదగొల్లపాలెం పంచాయతీ మరకావారిపాలెం గ్రామానికి చెందిన దొంతిబోయిన వంశీకృష్ణ(24) బైక్‌పై కర్లపాలెం నుంచి చందోలు వైపు వెళుతున్నాడు. ఈ సమయంలో బుద్దాం తుంగభద్ర కాలువ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వంశీకృష్ణకు తీవ్ర గాయాలవ్వడంతో 108 వాహనం ద్వారా బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రైతుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ కోరారు. స్థానిక జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుభరోసా నగదు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత ఏడాది తుఫాన్, అధిక వర్షాలకు దెబ్బతిన్నా పంటలకు రైతులందరికీ ఇవ్వవలసిన నష్టపరిహారాలతో పాటు సున్నా వడ్డీ పావలా వడ్డీ వెంటనే చెల్లించాలని కోరారు.

భారీ ఆధిక్యం దిశగా 'విశాఖ'

- ప్రారంభమైన ఏసీఏ అండర్-16 క్రికెట్ పోటీలు
- తొలిమ్యాచ్‌లో 42 పరుగులకే కుప్పకూలిన పశ్చిమ గోదావరి
- తొలిరోజే 349 పరుగుల ఆధిక్యంలో విశాఖ జట్టు
- డబుల్ సెంచరీ సాధించిన భాను శ్రీహర్ష



కె.గౌతమ్ ఆర్య, 6 వికెట్లు



కె.భానుశ్రీహర్ష, 209 పరుగులు



పి.ధీరజ్, 156 పరుగులు

నరసరావుపేట ఈస్ట్: ఒకవైపు వికెట్ల పతనం.. మరోవైపు పరుగుల వరదతో ఏసీఏ అండర్-16 బాలుర క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యంలో పెద చెరువులోని ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో సోమవారం అండర్-16 బాలుర అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. తొలి మ్యాచ్‌లో పశ్చిమ గోదావరి, విశాఖపట్నం జిల్లాల జట్లు తలపడ్డాయి.

42 పరుగులకే కుప్పకూలిన ప.గో.జట్టు..

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పశ్చిమ గోదావరి జట్టు పేలవమైన బ్యాటింగ్‌తో తన మొదటి ఇన్నింగ్స్‌లో 42 పరుగులకే కుప్పకూలింది. విశాఖ బౌలర్ల ధాటికి 27.1 ఓవర్లలోనే 10 వికెట్లు సమర్పించుకుంది. పశ్చిమ గోదావరి బాట్స్‌మెన్ సీహెచ్.ఎం.ఎస్.నాగసాకేత్ ఒక్కడే 11 బంతుల్లో 20 పరుగులు సాధించాడు. అందులో మూడు ఫోర్లు ఉన్నాయి. విశాఖ బౌలర్లు కె.గౌతమ్‌ఆర్య 9 ఓవర్లకు 11 పరుగులు ఇచ్చి 6 వికెట్లు పడగొట్టి పశ్చిమ గోదావరి పతనాన్ని శాసించగా, పి.శ్యామ్‌దినేష్ 8 ఓవర్లకు 11 పరుగులు ఇచ్చి 3 వికెట్లు సాధించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్‌లో రెండు వికెట్ల నష్టానికి 391 పరుగుల భారీస్కోర్ సాధించింది. విశాఖ బ్యాట్స్‌మెన్‌లు కె.భాను శ్రీహర్ష 209, పి.ధీరజ్ 156 పరుగులు సాధించారు. విశాఖ జట్టుకు 349 పరుగుల ఆధిక్యత లభించింది. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

స్వర్ణలో గడ్డి వాముల దగ్ధం

రూ.7 లక్షల నష్టం



స్వర్ణ (కారంచేడు): వరి గడ్డి వాములు దగ్ధమైన ఘటన మండలంలోని స్వర్ణ గ్రామంలో సోమవారం వేకువజామున జరిగింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన ఏడుగురి రైతులకు చెందిన సుమారు 50 ఎకరాల గడ్డి పూర్తిగా దగ్ధమైంది. వీఆర్వో సతీష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. సిద్దయ్య రైస్‌మిల్లు బజారులో గుత్తా సురేంద్రబాబు, కట్టిబోయిన తిరుపతయ్య, శ్రీనివాసరావు, దాసరి కమల, చీమల సాంబయ్య, దేసూరి కోటయ్య, కిల్లా శ్రీనివాసరావులకు చెందిన వరిగడ్డి వాముల్లో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఒక్కసారిగా నిప్పురవ్వలు ఎగిసిపడ్డాయి. గ్రామస్తులు మంటల్ని అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. స్థానికుల సమాచారంతో చీరాలకు చెందిన అగ్నిమాపక శాఖ సిబ్బంది వచ్చి అదుపుచేశారు. గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వరరావుపై తమకు అనుమానం ఉన్నట్లు రైతులు ఫిర్యాదు చేసినట్లు వీఆర్వో తెలిపారు. వారి నుంచి సమాచారం సేకరించి ఉన్నతాధికారులకు అందించామని ఆయన పేర్కొన్నారు.

వైభవంగా చర్చి ప్రతిష్ట



గ్రామస్తులతో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి పనబాక, వైఎస్సార్ సీపీ నాయకులు

పిట్టలవానిపాలెం: మండంలోని ఖాజీపాలెం శివారు గద్దం వారిపాలెంలో నూతనంగా నిర్మించిన చర్చి ప్రతిష్టను సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. దైవ సేవకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, బాపట్ల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు గాదె మధుసూదనరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఇద్దరూ గ్రామ పెద్దలతో సమావేశమయ్యారు. గ్రామస్తుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డేగల రవిరెడ్డి, మారుబోయిన శ్రీనివాసరెడ్డి, మద్దాల డేవిడ్, కుంచల వీరరాఘవరెడ్డి, అలవల అశోక్ రెడ్డి, కుంచల కిరణ్‌కుమార్‌రెడ్డి, పులి సాయి శ్రీధర్‌రెడ్డి, గాదె గోపిరెడ్డి, గోవతోటి విజయ్ పాల్గొన్నారు.

55 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

కొమెరపూడి శ్రీ విఘ్నేశ్వర రైస్ మిల్లులో విజిలెన్స్ తనిఖీలు



స్వాధీనం చేసుకున్న బియ్యంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు

సత్తెనపల్లి: రేషన్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేసి వాటిని నిల్వ ఉంచి రీసైక్లింగ్ చేసి విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. గుంటూరు రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సత్తెనపల్లి పౌరసరఫరాల డెప్యూటీ తహసీల్దార్ అరుణతో కలసి సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలోని శ్రీ విఘ్నేశ్వర రైస్ మిల్లులో సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఏ విధమైన రికార్డులు చూపలేదు. మిల్లులోని కానాలలో బియ్యపు రాశులు (ఫోర్టిఫైడ్) ఉన్నట్లు గుర్తించారు. ఆ బియ్యాన్ని గోనె సంచులలోకి ఎత్తించి కాటా వేయించారు. 110 బస్తాలలో బస్తా ఒక్కింటికి 50 కిలోల చొప్పున 55 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు తేల్చారు. మిల్లులో ధాన్యం కానీ, తవుడు కానీ, నూక కానీ కనిపించలేదు. మిల్లు యాజమాన్యం రేషన్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేసి, నిల్వ ఉంచి రీసైక్లింగ్ చేసి అమ్ముతుంటారని విచారణలో తేలినట్లు అధికారులు ప్రకటించారు. మిల్లులోని 110 బస్తాలలోని 55 క్వింటాళ్ల రేషన్ బియ్యం (ఫోర్టిఫైడ్) స్వాధీన పరచుకొని యజమాని గంగాధరరెడ్డిపై '6ఏ' కేసు నమోదు చేయవలసిందిగా సత్తెనపల్లి పౌర సరఫరాల డీటీ అరుణని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదేశించారు. తనిఖీలలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్స్ ఎస్.శ్రీనివాసులురెడ్డి, ఎ.శ్రీహరిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వెల్డర్ మృతి



పిడుగురాళ్ల: కరెంట్ షాక్‌కు గురై వెల్డర్ మృతి చెందిన సంఘటన పిడుగురాళ్లలో చోటు చేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... పిడుగురాళ్ల మండలంలోని కరాలపాడు గ్రామానికి చెందిన సయ్యద్ మస్తాన్‌వలి(35) వెల్డర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. దీనిలో భాగంగా పిడుగురాళ్ల పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌కు ఎదురుగా ఉన్న అమృత లక్ష్మీఫాండ్రీలో ఐరన్ మెట్లను తయారు చేసేందుకు సోమవారం ఉదయం వెళ్లాడు. మెట్లు నిర్మిస్తూ ఐరన్ రాడ్డును ఒక్కసారిగా తిప్పుతుండటంతో త్రీ ఫేజ్ వైర్‌కు తగిలి కరెంట్ షాక్‌కు గురయ్యాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు మస్తాన్‌వలిని పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు తెలియజేశారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల నమోదుపై శ్రద్ధ అవసరం



సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా అధికారులు

చినగంజాం: పాఠశాలలో విద్యార్థులు నమోదుపై శ్రద్ధ తీసుకోవాలని, దీనిపై విద్యాశాఖ సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా సీఎంఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మండల విద్యావనరుల కేంద్రంలో అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడిబయట పిల్లల్ని బడిలో చేర్పించేందుకు కృషిచేయాలని సూచించారు. స్కూల్ కిట్ల పంపిణీపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఎంఈవో బి. అజయ్‌బాబు, ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ సత్యసాగర్, సీఆర్పీలు పాల్గొన్నారు.


వైభవంగా ఆలయ ప్రథమ ప్రతిష్ఠోత్సవం



హోమం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

బాపట్ల: మండలంలోని కొండబొట్లవారిపాలెంలో గల శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం ప్రథమ ప్రతిష్ఠోత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుతో పాటు కుటుంబ సభ్యులు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆవరణలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంతో పాటు శ్రీ మహాలక్ష్మి, శ్రీ వరసిద్ధి వినాయక, శ్రీ అయ్యప్పస్వామి దేవాలయాల సముదాయాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి ఉదయం పంచామృత ఆరాధన, అగ్ని ప్రతిష్ఠాపన, విశేష హోమం జరిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం వెంకట కిరణ్ కుమార్, నల్లూరి పాంచజన్య కృష్ణమాచార్యులు, ఆలయ పాలకవర్గం, భక్తులు పాల్గొన్నారు.

కారు, ట్రాక్టర్ ఢీ: ఒకరు మృతి



కారులో పవన్‌కుమార్‌రెడ్డి మృతదేహం

అద్దంకి: కారు , ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని దర్శి-అద్దంకి రహదారిలో తిమ్మాయపాలెం గ్రామ సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. ప్రకాశం జిల్లా దర్శి మండలంలోని చామంతిపూడికి చెందిన బి.పవన్‌కుమార్ రెడ్డి (37) విజయవాడలో హోల్‌సేల్ ప్లేవుడ్ దుకాణం నడుపుతుంటారు. దర్శి, చీమకుర్తి, ఒంగోలు, కనిగిరి ప్రాంతాల్లో విక్రయించిన ప్లేవుడ్ తాలూకు నగదు వసూలుకు మధ్యాహ్నం 11 గంటలకు వచ్చారు. వసూలు పూర్తి చేసుకుని దర్శి నుంచి విజయవాడ వెళ్తున్నారు. మార్గమధ్యంలో మండలంలోని తిమ్మాయపాలెం గ్రామ సమీపంలో ప్రకాశం జిల్లాలోని పోలవరం గ్రామం నుంచి పొగాకు చెక్కలతో వెళ్తున్న ట్రాక్టర్‌ను క్రాస్ చేసే సమయంలో దాన్ని ఢీకొట్టారు. దీంతో కారులో ప్రయాణిస్తున్న పవన్‌కుమార్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందారు. కారు నడుపుతున్న నరేందర్‌రెడ్డి స్వల్పగాయాలతో బయటపడ్డారు. అతడ్ని 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పవన్‌కుమార్‌రెడ్డి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ఎస్ఐ నాగరాజు ఘటనా స్థలానికి చేరుకుని వివరాల సేకరణతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు: భట్టిప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పల్లె కోన ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ పి.ఏడుకొండలు సోమవారం తెలిపారు. వేమవరం, సూరేపల్లి, తాతావారిపాలెం, కోనేటిపురం, జంపనివారిపాలెం, పడమటిపాలెం, పల్లెకోన, రాచూరు గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా సరఫరాకు విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పశువులపాక, గడ్డి వాము దగ్ధం



నగరం: అగ్ని ప్రమాదంలో పశువుల పాక, వరి గడ్డి వాము దగ్ధమైన సంఘటన సోమవారం నగరం శివారు యాదవపాలెంలో చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు యాదవ పాలెంకు చెందిన దబ్బుకూటి కోటయ్య ఇంటి వద్ద ఉన్న వరిగడ్డివాము నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న పశువుల పాకకు మంటలు వ్యాపించడంతో పశువుల పాక పూర్తిగా అగ్నికి ఆహుతయ్యింది. స్థానికులు రేపల్లె అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. స్థానికులు మంటలు అదుపు చేసే ప్రయత్నం చేశారు. అగ్ని మాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు కోటయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

ఎంపీడీఓకు సన్మానం



వేమూరు: ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా పనిచేస్తే గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ యల్లమాటి మోహనరావు తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి జీఎస్‌వీ శేషగిరిరావు సన్మాన కార్యక్రమాన్ని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో 92 రోజులు ఎన్నికల ప్రవర్తనా నియామావళిని సక్రమంగా పాటించి విధులు నిర్వర్తించడం వల్ల ఎంపీడీఓకు జిల్లా కలెక్టరు అభినందించి ప్రశంసా పత్రం అందించడం జరిగిందన్నారు. సోమవారం మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చందోలు సునీత, విద్యాశాఖాధికారులు ఐ వెంకటేశ్వర్లు, రోజ్‌ల్యాండ్, అనురాధ, శోభన్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి ఘటనలో కేసు నమోదు

చెరుకుపల్లి: చెరుకుపల్లి మండలం రాంబొట్లవారిపాలెం గ్రామానికి చెందిన రాజ్‌కుమార్‌పై అదే గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు మంగళవారం రాత్రి దాడి చేసి గాయపరిచినట్లు తమకు ఫిర్యాదు అందిందని చెరుకుపల్లి ఎస్ఐ సురేష్ మంగళవారం తెలిపారు. బాధితుడు రాజ్‌కుమార్ తనపై గ్రామానికి చెందిన 18 మందికి పైగా వ్యక్తులు మూకుమ్మడిగా దాడిచేసి గాయపరచటంతో పాటు తీవ్ర పదజాలంతో దూషణకు పాల్పడ్డారని ఫిర్యాదు చేశాడన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

కర్లపాలెం: ఓ వివాహిత మహిళ అదృశ్యమైన ఘటన కర్లపాలెం మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కర్లపాలెం హెడ్ కానిస్టేబుల్ రహీమ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని నల్లమోతువారిపాలెంకు చెందిన చలంచర్ల శ్రీదివ్య ఈనెల 20న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైందని తెలిపారు. అప్పటి నుంచి బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించక పోవటంతో భర్త జగదీష్ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రహీమ్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థికి బొమ్మిడాల ట్రస్ట్ ఆర్థిక సాయం

గుంటూరు ఎడ్యుకేషన్: గేట్‌లో జాతీయస్థాయిలో సాధించిన రెండో ర్యాంకు ఆధారంగా ముంబై ఐఐటీలో ఎంటెక్ సీటు పొందిన అద్దంకి పట్టణానికి చెందిన ఘంటసాల రవితేజకు బొమ్మిడాల భానుమూర్తి ట్రస్ట్ చైర్మన్ బొమ్మిడాల భానుమూర్తి సెమిస్టర్‌కు రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేసేందుకు ముందుకు వచ్చారు. సోమవారం కాకానిరోడ్డులోని ట్రస్ట్ కార్యాలయంలో విద్యార్థి రవితేజకు రూ.లక్ష చెక్కు అందజేశారు. ఆర్థిక సహాయాన్ని అందించేందుకు కృషి చేసిన ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, అవోపా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యదర్శి పొట్టి శ్రీరాములు, గాంధీ క్లబ్స్ చైర్మన్ బంగారుబాబు, కొలిశెట్టి సతీష్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో హెలా షారోన్



వేమూరులో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

- ఆర్డీవో హెలా షారోన్
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు

రేపల్లె రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో హెలా షారోన్ అన్నారు. పట్టణంలోని రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి అనంతరం మాట్లాడారు. వ్యవసాయ భూమి ఆన్‌లైన్ చేయాని కోరుతూ నిజాంపట్నంకు చెందిన వ్యక్తి నుంచి ఒక అర్జీ అందిందన్నారు. భట్టిప్రోలు మండలం పెదలంక గ్రామానికి మంజూరైన స్మశాన వాటికకు హద్దులు నిర్ణయించాలని గ్రామస్తుల నుంచి ఒక అర్జీ అందిందన్నారు. రేపల్లె మున్సిపాలిటీ పరిధిలోని భాష్యం స్కూల్‌లో తన బిడ్డకు ఉచిత సీటు లభించినప్పటికీ స్కూల్ బుక్స్, యూనిఫామ్, బస్సు ఫీజు కట్టమని స్కూలు యాజమాన్యం బలవంతం చేస్తోందని ఒక అర్జీ, రేపల్లె మున్సిపాలిటీ ఏరియా పరిధిలోని తన ఇంటి స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం జరుగుతున్నదని ఆ నిర్మాణం పనులు నిలిపివేయాలని కోరుతూ ఒక అర్జీ, రేపల్లె మండలం బేతపూడి పరిధిలోని పల్లెకోన వెళ్లే దారిలో నిర్మించిన ఐస్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థాలతో తమ పొలాలలో పంట సరిగా పండక పోవటంతో రైతుల నుంచి అర్జీ అందినట్లు తెలిపారు. అర్జీలను పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని వెల్లడించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

వేమూరు: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యలపై పరిష్కార వేదిక నిర్వహించారు. వేదికకు 4 అర్జీలు అందాయన్నారు. అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కారం చేయడం జరిగిందని ఆయన చెప్పారు. వేమూరు గ్రామానికి చెందిన వ్యక్తి కుల ధృవీకరణ పత్రం కోసం అర్జీ అందజేశారు. చంపాడు గ్రామానికి చెందిన వ్యక్తి మరణ ధృవీరణ ప్రతం సర్టిఫికెట్ కోసం అర్జీ అందజేశారు. పోతుమర్రు గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు ఇప్పించాలని అర్జీలు అందజేశారన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు ఐ వెంకటేశ్వర్లు, రోజ్‌ల్యాండ్, ఎంపీ యం శోభన్, మండల ప్రాథమిక ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్ పున్నారావు, అంగన్‌వాడీ సూపర్ వైజర్ రత్నకుమారి, మండల పంచాయతీ అధికారి చొప్పర శేఖర్, మండల వ్యవసాయాధికారి చందోలు సునీత తదితరులు పాల్గొన్నారు.

నాసా సైంటిస్ట్‌తో విద్యార్థుల ఆన్‌లైన్ సంభాషణ

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు నాసా(నేషనల్ ఎరోనాటికల్ అండ్ స్పేస్ అడ్మిషన్)లో ప్రోగ్రామ్ సైంటిస్ట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న హెన్రీ ట్రూప్‌తో సోమవారం భేటీ అయ్యారు. ఆయన విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు విపులంగా సమాధానం ఇచ్చారు. మార్స్ గ్రహంపై నాసా ప్రయోగించబోతున్న మానవ సహిత స్పేస్ మిషన్, ఏలియన్స్ మనుగడ, ఎస్కో ప్లానెట్స్‌పై ఉన్న సందేహాలు నివృత్తి చేశారు. అలాగే స్పేస్ టెక్నాలజీలో విద్య, ఉద్యోగ అవకాశాలను గూర్చి వివరించారు. ఈ కార్యక్రమం భారత కాలమాన ప్రకారం 2:40 గంటలకు ప్రారంభమై గంటసేపు కొనసాగింది. కార్యక్రమాన్ని ఆంగ్లోపాధ్యాయులు పచ్చారు హరికృష్ణ నిర్వహించారు. ట్రూప్‌తో నెల రోజుల క్రితమే అపాయింట్‌మెంట్ తీసుకోవడం జరిగిందని హరికృష్ణ తెలిపారు. సాధారణంగా గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థులకు ఇటువంటి అవకాశం లభించడం అదృష్టమని ప్రధానోపాధ్యాయులు మాచర్ల మోహన్‌రావు అన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన హరికృష్ణను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.



నాసా ప్రోగ్రామ్ సైంటిస్ట్‌తో ఆన్‌లైన్‌లో సంభాషిస్తున్న విద్యార్థులు

30న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రేపల్లె రూరల్: మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 30న ఆదివారం ఉదయం 11.30 గంటలకు మండల పరిషత్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పెనుమా సుశీల అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

మీ కోసంలో 11 అర్జీలు

తెనాలిరూరల్: తెనాలి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమంలో 11 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వీటిలో రెవిన్యూ శాఖకు చెందినవి ఎనిమిది ఉండగా గృహ నిర్మాణ, పంచాయతీరాజ్ శాఖలకు చెందినవి మూడు అర్జీలు ఉన్నట్టు చెప్పారు. వచ్చిన అర్జీలను త్వరిత గతిన పరిష్కరిస్తామన్నారు.

ఎన్ఎస్ఎస్ అధికారిగా వినయ్‌కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: లాడ్జి సెంటర్లోని ఆంధ్ర లూథరన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్(ఏఎల్) ఎన్ఎస్ఎస్ నిర్వహణాధికారిగా సోషల్ స్టడీస్ విభాగాధిపతి ఎం.వినయ్‌కుమార్‌ను ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగం నియమించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాదాసు ఎస్తేరు సునీల తెలిపారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సునీల మాట్లాడుతూ సేవాభావంతో సమాజానికి చేతనైన సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉంటుందని పేర్కొన్నారు.

బొల్లివ్యాధిపై అవగాహన ర్యాలీ

గుంటూరు మెడికల్: ప్రపంచ బొల్లి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ డెర్మటాలజీ, వెనిరియాలజీ, లెప్రాలజీ అసోసియేషన్ గుంటూరు, రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో స్థానిక బృందావన్‌గార్డెన్స్ ఎన్టీఆర్ స్టేడియం నుంచి లక్ష్మీపురం మదర్‌థెరిసా విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ అత్తోట కవిత మాట్లాడుతూ బొల్లి అంటు వ్యాధి కాదని, చర్మంలో మెలోనైక్ కణాలు తగ్గడం వలన వస్తుందని తెలిపారు. వ్యాధి నివారణకు అన్ని రకాల మందులు, పూత మందులు, ఫొటోథెరపీ చికిత్సలు, సర్జరీలు, లేజర్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. వ్యాధి మొదలైనప్పుడే చర్మవ్యాధుల వైద్యులను సంప్రదిస్తే పూర్తిగా నివారించవచ్చు అన్నారు. వివాహం చేసుకోవడానికి బొల్లి మచ్చలు ఏమాత్రం అడ్డు కాదన్నారు. ర్యాలీలో సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జె.సౌజన్య, డాక్టర్ సీతారామ్, డాక్టర్ ఎ.శిరీష, డాక్టర్ టి.వాణి, డాక్టర్ సౌమ్య, డాక్టర్ షకీల, డాక్టర్ మన్నెసింధూర, డాక్టర్ నాగేశ్వరమ్మ, డాక్టర్ నీలిమ, లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు లాల్‌వజీర్, పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న చర్మ వ్యాధి నిపుణులు

బాజాలు మోగేది శ్రావణంలోనే!

- ఏప్రిల్ 28 నుంచి నిలిచిన శుభకార్యాలు
- వరుసగా శుక్ర, గురు మౌఢ్యమిలు రాక
- ఆగస్టు 7 తరువాతే వివాహాలు, గృహ ప్రవేశాలు

ఏ కార్యం తలపెట్టినా దానికి మంచి లగ్నం, శుభఘడియలు చూసుకోవడం హిందువుల సంప్రదాయం. కొత్త ఇంట్లోకి అడుగుపెట్టాలన్నా, పిల్లలకు పెళ్లిళ్ల చేయాలన్నా, నూతన గృహానికి శ్రీకారం చుట్టాలన్నా అందరూ చూసుకునేది చక్కటి ముహూర్త బలమే. రెండు మాసాలుగా అటువంటి ముహూర్తాలకు విరామం లభించింది. మరో నెల పాటు ఆ ముహూర్తాల జాడ(ఆషాఢ మాసం) కానరాదు. రానున్న ఆగస్టు నెలలో వచ్చే శ్రావణమాసం వస్తే తప్ప అందరి ఇళ్లకు పచ్చటి తోరణాలు, భాజాభజంత్రీలు మోగే అవకాశం ఉండదు.



కల్యాణ మండపం

నెహ్రూనగర్: క్రోధి నామ సంవత్సరంలో ఏప్రిల్ తొమ్మిదో తేదీ నుంచి ముహూర్తాలు ప్రారంభమై 26వ తేదీ వరకు నడిచాయి. ఏప్రిల్ 28 నుంచి జూలై ఎనిమిదో తేదీ వరకు శుక్ర మౌఢ్యమి(మూఢం) నడుస్తోంది. అలాగే మే 7వ తేదీ నుంచి జూన్ ఏడో తేదీ వరకు గురు మౌఢ్యమి. వరసగా గురు, శుక్ర మౌఢ్యములు రావడంతో రెండు నెలలుగా శుభకార్యాలకు ఆటంకం ఏర్పడింది. మరోవైపు జూలై 5వ తేదీ నుంచి ఆషాఢ మాసం ప్రారంభమై ఆగస్టు ఐదో తేదీ వరకూ కొనసాగుతుంది. ఇది శూన్యమాసం కావడంతో ఈ నెలలో కూడా వివాహాలు, ఉపనయనాలు, గృహప్రవేశాలు వంటి శుభ కార్యాలు నిర్వహించరు. ఏప్రిల్ 28 నుంచి ఆగస్టు ఐదో తేదీ వరకూ పెళ్లి భాజాలు, ఏ ఇతర శుభకార్యాలు జరిగే అవకాశం లేదని పండితులు, పురోహితులు చెబుతున్నారు. మూఢంలో కేవలం అన్నప్రాసన, అక్షరాభ్యాసం, నామకరణం, నూతన వ్యాపారాల ప్రారంభోత్సవాలు, సీమంతాలు, రిజిస్ట్రేషన్లు వంటివి చేసుకోవచ్చని పండితులు సూచిస్తున్నారు. అలాగే సెప్టెంబర్ నాలుగో తేదీ నుంచి అక్టోబర్ మూడో తేదీ వరకూ భాద్రపదం కూడా శూన్యమాసమే కావడం వల్ల ఆ సమయంలోనూ శుభముహూర్తాలు ఉండవని చెబుతున్నారు.

శ్రావణ మాసంలోనే..

శ్రావణ మాసం ఆగస్టు ఏడో తేదీ నుంచి ప్రారంభమై సెప్టెంబర్ 3వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ నెలలోనే దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. వాటిలో 12, 13, 19, 20, 26, 27 తేదీల్లో శుక్ర, మంగళవారాలు మినహా అన్నీ రోజులూ దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు.

ఉపాధికి దెబ్బ

గత రెండు నెలలుగా వివాహ ముహూర్తాలకు మూఢాలు అడ్డంకి కావడంతో వందలాది మంది ఉపాధిపై తీవ్ర ప్రభావం పడింది. కల్యాణ మండపాలు, కేటరింగ్, వంటవారు, పురోహితులు, ఫొటో, వీడియో గ్రాఫర్స్, ట్రావెల్స్ కార్లు, బస్సులు, మినరల్ వాటర్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, పూలు, డెకరేషన్ లైటింగ్, కూరగాయలు, కిరాణం, వస్త్ర, బంగారు, వెండి ఆభరణాలు, షామియానాలు, హోటళ్లు, లాడ్జిలతో పాటు సాంస్కృతిక కళాకారులకు పని కరువైంది. మరి ఎంతో మంది రోజు వారీ కూలీలకు ఉపాధి లేకుండా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

శ్రావణం వరకు ఆగాల్సిందే



గురు, శుక్ర మౌఢ్యాలు వరుసగా రావడంతో వివాహాలు, ఉపనయనాలు, గృహప్రవేశాలు నిలిచిపోయాయి. ఏప్రిల్ నెల చివరి నుంచి వివాహాలకు కొంత కాలం ముహూర్తాలు లేవు. శ్రావణ మాసంలో ఆగస్టు 7 నుంచి 28వ తేదీ వరకు నాలుగైదు రోజులు మినహా దివ్యమైన ముహూర్తాలున్నాయి. మళ్లీ భద్రపద మాసం కూడా శుభకార్యాలు ఉండవు.

– ఏకా సాయి భరద్వాజ్, అర్చకుడు, గుంటూరు

అన్ సీజన్ వలన ఇబ్బందులు



లైటింగ్, డెకరేషన్, టెంట్ హౌస్, ఆర్కెస్ట్రా, శుభకార్యాల మీద ఆధారపడి పనిచేసే అన్ని వర్గాల వారు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పనులు తప్ప వేరే పనులు చేసుకోలేక ఇళ్లకే పరిమితమవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. ఆగస్టులో కొన్ని ముహూర్తాలు ఉన్నాయి. అప్పటి వరకు వేచి చూడాల్సిందే.

– మేడా ప్రభుకుమార్, ఫ్లవర్ డెకరేషన్, గుంటూరు

సకాలంలో సాగునీరు అందివ్వాలి

అధికారులకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సూచన

వేమూరు: వ్యవసాయం సాగు చేస్తున్న రైతులకు ఖరీఫ్ సీజన్లో ఇరిగేషన్ అధికారులు సాగు నీరు సక్రమంగా విడదల చేయాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సూచించారు. వేమూరు నియోజక వర్గం అమర్తలూరు మండలంలోని కూచిపూడి గ్రామంలోని ఇరిగేషన్ కార్యాలయంలో సోమవారం డ్రైనేజీ, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ అధికారులు పంట కాలువల్లో నిలిచిపోయిన తుటి కాడ, గుర్రపు డెక్క పూర్తిగా తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో చివరి సాగు పొలాలకు నీరు అందించే బాధ్యత ఇరిగేషన్ అధికారులు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు సాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పది రోజుల్లో రైతులు, కౌలు రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ తరుణంలో ఇరిగేషన్ అధికారులు సాగునీరుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వర్షాలు కురవక పోయినా రైతులకు సాగు నీరు ఇవ్వాలని అన్నారు. పంట కాలువల్లో తుటి కాడ, గుర్రపు డెక్క తొలగించేందుకు టెండరు లేకుండా పనులు రెండు రోజుల్లో ప్రారంభించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ మల్లికార్జున, డీఈ దీనదయాళ, యంకేవీ ప్రసాద్, డ్రైనేజీ ఈఈ వెంటరత్నం, ఇంజనీర్లు, రైతులు పాల్గొన్నారు.



కూచిపూడి ఇరిగేషన్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న నక్కా ఆనందబాబు

ఐదుగురు కార్యదర్శులకు డీడీవో బాధ్యతలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలో ఐదుగురు నూతన పంచాయతీ కార్యదర్శులకు డీడీవో అధికారాలు కల్పించబడ్డాయి. గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు తాము పని చేస్తున్న పంచాయతీలలో డీడీవోలుగా పూర్తి స్థాయి అధికారాలు కల్పిస్తూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. 3, 4 గ్రామాలకు ఒక్కరే పంచాయతీ కార్యదర్శిగా వ్యవహరించడంతో ఏ అవసరమైనా ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. గత ప్రభుత్వం ఒక పంచాయతీకి ఒక కార్యదర్శిని నియామించాలనే ఆలోచనతో ఫిబ్రవరి నెలలో జీవో నెంబర్-11ని జారీ చేయడం జరిగింది. ఐతే ఎన్నికల కారణంగా ఆ జీవో అమలుకు నోచుకోలేదు. మండలంలో రాచూరుకు వక్కలగడ్డ సురేష్, కోనేటిపురంకు ఎ.చినవెంకటేష్ బాబు, అక్లమూడికి పి. ప్రదీప్‌కుమార్, చింతమోటుకు పీఆర్ దీపక్, పెసర్లంకకు కె. గణేష్ డీడీవోలుగా నియమితులయ్యారు. ఆయా పంచాయతీ కార్యదర్శులు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జేబీవీ మల్లికార్జునరావు, ఈవోపీఆర్డీ టి. ఉషారాణిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రతి గ్రామంలో కార్యదర్శి అందుబాటులో ఉండటం వల్ల గ్రామ స్థాయిలో పాలన మెరుగుపడి సమస్యలకు సత్వర పరిష్కారం లభించే అవకాశం కలిగింది.



ఎంపీడీవో మల్లికార్జునరావును కలిసిన కార్యదర్శులు

డయేరియా రాకుండా జాగ్రత్తలు తీసుకోండి

వేమూరు: గ్రామీణ ప్రాంతాల్లో డయేరియా సోకుండా పంచాయతీ అధికారులు నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శేషగిరిరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, ఆర్‌డబ్ల్యూ ఎస్ అధికారులతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, క్లోరినేషన్, ట్యాంక్ క్లీనింగ్ చేపట్టి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వారానికి ఓసారి నీటి నమూనాలను సేకరించి వాటిని పరీక్ష చేయించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సలహా మేరకు పరిశుభ్రమైన తాగునీరు సరఫరా చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీల్లో వాటర్ పైపు లైను లీకేజీలు లేకుండా మరమ్మతులు చేయించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు మండలంలో డయేరియా కేసు నమోదు కావడం జరిగిందన్నారు. మండలంలో పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు డయేరియా కేసులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



అధికారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ శేషగిరిరావు

జీఓ 84ను రద్దు చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలలకు గొడ్డలిపెట్టువంటి జీఓ 84ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్(1938) రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంపాలెంలోని సంఘ జిల్లా కార్యాలయంలో నగర శాఖ కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రంలోని మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాలని కోరారు. సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు గోవిందు వెళాంగిణిరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అప్‌గ్రేడ్ అయిన 54 ఉన్నత పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను తక్షణమే మంజూరు చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టెబోయిన నరసింహారావు మాట్లాడుతూ 84 జీఓను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఆడిట్ కమిటీ చైర్మన్ జె.వి జయానంద్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 506, 507 ద్వారా మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు నిర్వహించాలని కోరారు. సీనియర్ నాయకుడు ఎ.రామారావు మాట్లాడుతూ మున్సిపల్, కార్పొరేషన్ మేనేజ్‌మెంట్లలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు జీపీఎస్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. మున్సిపల్ పాఠశాలలకు పర్యవేక్షణ అధికారులుగా సీనియర్ ఉపాధ్యాయులను నియమించాలని పేర్కొన్నారు. సమావేశంలో సంఘ జిల్లా సహాధ్యక్షుడు ఓ. నాగార్జున, నగర ప్రధాన కార్యదర్శి కె. గోపి, నగర ఉపాధ్యక్షులు వై.మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు

వైభవంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు

నగరంపాలెం: స్థానిక ఎస్‌వీఎస్ కాలనీ పద్మావతి గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉదయం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహం, అగ్నిద్యానం, నిత్య హోమం, నవగ్రహారాధన హోమం, వెంకటేశ్వర మూలమంత్ర హోమం, చక్రస్నానం, యాగ పూర్ణాహుతి వంటి కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆలయానికి విచ్చేసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం వేళ ధ్వజావరోహణ, ద్వాదశ ప్రదక్షిణాలు, పవళింపు సేవ కార్యక్రమాలను భక్తి ప్రపత్తులతో జరిగాయి. ఆలయ అధ్యక్షులు వట్టికూటి పూర్ణచంద్రరావు, కార్యదర్శి నల్లమోతు రత్తయ్య, కోశాధికారి పుచ్చ వెంకట మల్లేశ్వర్, ఉపాధ్యక్షులు పావులూరి కిషోర్, సంయుక్త కార్యదర్శి ఇమ్మడి శ్రీనివాసరావు, నైషధం శ్రీనివాస్ పాల్గొన్నారు.



నిత్య హోమం